


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, జూలై 9, 2026 పేజీలు : 7


## కందనులు అభివృద్ధిలో... మరో

# చారిత్రక అడుగు

- రూ.12 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌కు శంకుస్థాపన
- రాష్ట్రంలోనే ఆదర్శ బస్టాండ్‌గా తీర్చిదిద్దుతాం
- ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాట పట్టించిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే
- 365వ బస్టాండ్‌గా నాగర్‌కర్నూల్‌కు ప్రత్యేక గుర్తింపు
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- నాగర్ కర్నూల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ జులై 8 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లా కేంద్రం నాగర్ కర్నూల్ అభివృద్ధిలో మరో కీలక మైలురాయి ఆవిష్కృతమైంది, పట్టణంలోని బస్ డిపో సమీపంలో నాలుగు (4)ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసేలా రూపుదిద్దుకోనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు, రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, శంకుస్థాపన చేశారు

## ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో

# జాప్యం ఉండొద్దు

-:భూ సమస్యల నుంచి హాస్టల్ వసతుల వరకు ప్రతి అంశంపై చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో):** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె అధ్యక్షతన నిర్వహించిన డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశంలో పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు.
సమావేశం ప్రారంభంలో గత డీవీఎంసీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించారు.

## వాన కోసం రైతన్న ఎదురుచూపులు

చిరుజల్లులతోనే సాగు పనులు ప్రారంభించిన రైతులు





## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

- ప్రమాదకర కూడళ్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ
- భద్రతా చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు




## డిజిటలైజేషన్ ప్రక్రియ గడువులోగా

# పూర్తి చేయాలి

-తిమ్మాజీపేటలో డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్
-పొరపాట్లు జరగకుండా వివరాలు నమోదు చేయాలి
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



## కందనులు అభివృద్ధిలో... మరో

# చారిత్రక అడుగు

. ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతోందని, ఒకప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్టీసీ నేడు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ లాభాల బాటలో పరుగులు పెడుతోందని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 10,170 బస్సులు, 97 డిపోలు, 364 బస్టాండ్లు, సుమారు 55 వేల మంది ఉద్యోగులతో తెలంగాణ ఆర్టీసీ ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చుతోందని, ప్రజా రవాణాలో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని, మహిళా లక్ష్మీ పథకం ద్వారా ఇప్పటి వరకు 326 కోట్లకు పైగా మహిళా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, ఈ పథకం ద్వారా మహిళలు రూ.11,377 కోట్ల మేర ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వివరించారు. మహిళలను బస్సుల యజమానులుగా భావిస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని, ఈ ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికే దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, పదేళ్లపాటు కొత్త బస్సుల కొనుగోలు జరగలేదని, 53 రోజులపాటు సాగిన ఆర్టీసీ సమ్మె సమయంలో కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా సంస్థను మరింత సంక్షోభంలోకి నెట్టారని, అయితే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వచ్చిన తర్వాత మూడు రోజుల్లోనే ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వివిధ కారణాలతో ఉద్యోగాలకు దూరమైన 355 మంది ఉద్యోగులకు తిరిగి నియామక పత్రాలు అందించిందని గుర్తు చేశారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడిన మంత్రి, ప్రజలు కూడా ఆర్టీసీని తమ సొంత సంస్థగా భావించి ఆదరించాలని, ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ బీఎల్‌వోలు అందించే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి, అవసరమైన ఫొటోలు సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటును జాబితాలో కొనసాగించే బాధ్యత తీసుకోవాలని అన్నారు.

ఈసారి వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు నీటి వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో అధిక లాభాలు ఇచ్చే పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే రైతులకు మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు.

నాగర్‌కర్నూల్‌లో నిర్మించనున్న నూతన బస్టాండ్ రాష్ట్రస్థాయిలోనే ఆదర్శ బస్టాండ్‌గా నిలిచేలా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మిస్తామని, ప్రయాణికులకు అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపడతామని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ పడటం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి అర్హ కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను ఆశపెట్టి నిరాశపరిచిందని తెలిపారు. హైదరాబాదులో 377 కొత్త రూట్లతో 7 లక్షల మంది ప్రయాణికులను చేరవేసేలా చర్యలు తీసుకున్నామని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళుతుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకువచ్చిందన్నారు. ప్రతిరోజూ లక్షలాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తూ కుటుంబ ఆర్థిక భారం తగ్గించుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు రవాణా శాఖను సమర్థంగా నడిపిస్తూ ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీని ప్రైవేటీకరణ దిశగా నడిపించే ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం సంస్థను మరింత బలోపేతం చేస్తోందన్నారు.

గత ప్రభుత్వం చేసిన అప్పులకు భారీగా వడ్డీలు చెల్లిస్తూనే ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఉయ్యాలవాడలో రూ.200 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంతో పాటు రూ.12 కోట్లతో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణం చేపట్టడం ప్రభుత్వ అభివృద్ధి చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో అనేక కోట్ల రూపాయలతో రహదారులు, సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నూతన బస్టాండ్ నిర్మాణం పూర్తయితే నాగర్‌కర్నూల్ పట్టణ రూపురేఖలు మారిపోతాయని, పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగం, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్‌కు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నాగర్‌కర్నూల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వంతో పాటు తాను కట్టుబడి ఉంటూ అభివృద్ధి పనులు కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.మహిళా లక్ష్మి పథకం అమలుతో మహిళలు చేసిన పొదుపు అంతర్జాతీయ స్థాయిలో కూడా చెప్పుకోదగ్గ విజయమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 364 బస్టాండ్లు ఉండగా నాగర్‌కర్నూల్‌లో కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయితే అది రాష్ట్రంలోని 365వ బస్టాండ్‌గా నిలుస్తుందని తెలిపారు. నూతన బస్టాండ్‌లో విశాలమైన ప్లాట్‌ఫారాలు, ఆధునిక వేచి ఉండే హాళ్లు, డిజిటల్ సమాచార వ్యవస్థ, పార్కింగ్ సౌకర్యం, షాపింగ్ కాంప్లెక్స్, వాణిజ్య సముదాయాలు, భవిష్యత్‌లో అవసరమైతే మల్టీప్లెక్స్ లేదా సినిమా థియేటర్ ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు, ఈ నిర్మాణం పూర్తయితే నాగర్‌కర్నూల్‌కురాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అనంతరం నాగర్ కర్నూల్ నుండి వయా తూడుకుర్తి నుండి వనపర్తి కి ప్రయాణించే బస్సును రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కలెక్టర్, జెండా ఊపి ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అరుణా రెడ్డి నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, మహిళలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ గడువులోగా

# పూర్తి చేయాలి

నాగర్ కర్నూల్ : జులై 08 (ప్రజా జ్యోతి)

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ ఎన్నికల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా,వేగవంతంగా కొనసాగేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,బూత్‌స్థాయి అధికారులు నిర్వహిస్తున్న పనితీరును సమీక్షిస్తూ,ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎమ్యూనరేషన్ ఫారాల స్వీకరణ,వాటి నమోదు, డేటా ఎంట్రీ,డిజిటలైజేషన్ పురోగతి తదితరఅంశాలపై కలెక్టర్ ఆరా తీసి ఫారాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని,అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని,ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఈ నెల 24వ,తేది నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని,ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకుని,పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైనదని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చన,తిమ్మాజీపేట తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

**మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**

మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలో తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి బుధవారం ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కూడళ్లు, మలుపులను స్వయంగా సందర్శించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డులోని ఏనుగొండ ఎక్స్‌రోడ్డు, ఐడీఓసీ ఎదురుగా మహబూబ్‌నగర్-- భూత్‌పూర్ రహదారిలోని ప్రమాదకర మలుపు, అలాగే కోయిలకొండ-- మహబూబ్‌నగర్ బైపాస్ సర్కిల్ ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అధికారులతో కలిసి సమీక్షించారు.రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ రద్దీ, వాహనాల వేగం, హెచ్చరిక బోర్డులు, డివైడర్లు, సిగ్నలింగ్ వ్యవస్థ, వీధి దీపాలు, రోడ్డు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఐడీఓసీ ఎదురుగా ఉన్న ప్రమాదకర మలుపు వద్ద ప్రస్తుతం ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌ను తొలగించి, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించే విధంగా తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అవసరమైన చోట వెంటనే భద్రతా చర్యలు చేపట్టి, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు.ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాన కోసం రైతన్న ఎదురుచూపులు

**చిన్నంబావి, జులై 8 (ప్రజాజ్యోతి)**

ఆషాఢం వచ్చేసినా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో చిన్నంబావి మండల రైతన్నల్లో ఆందోళన నెలకొంది.అక్కడక్కడా కురిసిన చిరుజల్లులతో నేల పూర్తిగా తడవకపోయినా,సీజన్ దాటిపోకూడదనే ఆందోళనతో రైతులు మొక్కజొన్నతో పాటు ఇతర పంటల విత్తనాలను పొలాల్లో చల్లుతున్నారు.అధిక ధరలకు కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనన్న భయం రైతులను వెంటాడుతోంది. "ఇప్పటికైనా వాన కురిస్తేనే పంట బతుకుతుంది.. లేదంటే పెట్టుబడంతా నీళ్లలో కలిసినట్టే" అంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు వర్షాభావం.. మరోవైపు విత్తనాల కోసం చేసిన అప్పుల భారం రైతులను కలవరపెడుతోంది. తేమలేని భూముల్లోనే విత్తనాలు చల్లుతూ, వానదేవుడు కరుణించాలని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వర్షాధార పంటలకు జీవం పోయాలని, అన్నదాతల కష్టాలు గట్టెక్కాలని మండల రైతులు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండొద్దు

అనంతరం కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీల భూ ఆక్రమణలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, మత్స్యకార సంఘాల్లో సభ్యత్వం, రైతుబంధు, పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాల సబ్సిడీలు, ఆర్థిక సహాయం, హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమావేశంలో ప్రస్తావించిన అంశాలను ఇప్పటికే జిల్లా పరిపాలనతో పాటు పోలీసు శాఖ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజావాణిలో కూడా హాస్టల్ సీట్ల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నందున ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని చెప్పారు.అలాగే, కమిటీ సభ్యుల సూచన మేరకు సమావేశ మినిట్స్‌ను మూడు రోజుల ముందుగానే సభ్యులకు పంపించాలని, తదుపరి సమావేశానికి ముందు గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ దరవత్ జానకి, ఆర్డీవో నవీన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, డీవీఎంసీ సభ్యులు కె. లక్ష్మన్, బాలయ్య, చంద్రశేఖర్, మోహన్ లాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- తిమ్మాజిపేట బస్టాండ్‌లో సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన
- ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నాగర్ కర్నూల్ జులై 8( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో అభివృద్ధి పనులకు... సబ్బండ కులాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట బస్టాండ్‌లో 11.5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించిన మంత్రి, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టణాలకు దీటుగా రహదారులు, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తిమ్మాజిపేట బస్టాండ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నందున సీసీ రోడ్డు నిర్మాణంతో దుమ్ము, బురద సమస్యలు తొలగిపోవడంతో పాటు ప్రయాణికులకు, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. తిమ్మాజిపేట అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఆర్టీసీ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## - మెడికల్ క్యాంపుల్లో గుర్తించిన రోగులకు మెరుగైన ఫాలోఅప్ అందించాలి: డీఎంహెచ్‌వో డా. ఎ. శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో): జిల్లాలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లో గుర్తించిన రోగులకు నాణ్యమైన చికిత్సతో పాటు సమర్థవంతమైన ఫాలోఅప్ అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. ఎ. శ్రీనివాసులు వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వారీగా మెడికల్ క్యాంపుల్లో గుర్తించిన వ్యాధులు, అందించిన చికిత్సలు, పైస్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసిన కేసులు, అనంతర పర్యవేక్షణ (ఫాలోఅప్) అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. జనరల్ మెడిసిన్, కంటి వ్యాధులు, స్త్రీల ఆరోగ్య సమస్యలు, కీళ్లు--ఎముకల వ్యాధులు, చిన్నారుల వ్యాధులు, దంత సంబంధిత సమస్యలతో పాటు ఇతర వ్యాధుల గుర్తింపు, చికిత్స, రిఫరల్ సేవలు సమర్థవంతంగా అమలు కావాలని సూచించారు. వైద్యాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా,



ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరాలపై నిఘా ఉంచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీవైడీఎంహెచ్‌వో డా. శశికాంత్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శైలజ, డా. బిలకంటి శంకర్, డా. శివకాంత్, డా. పులి విద్య, జిల్లాలోని వైద్యాధికారులు, ఎస్‌వో నార్య, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా, ఎంపీహెచ్ఈఓ సుభాష్, డీపీఓ సీతారాం గౌడ్, డీడీఎం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### రాష్ట్ర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు

### 108,102,1962 అంబులెన్స్ లు ఆకస్మిక తనిఖీ

**కల్వకుర్తి, జులై 8 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంతో జీవికే ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో నడుస్తున్న 108, 102 అత్యవసర అంబులెన్స్ సేవల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని అంబులెన్స్‌ను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అంబులెన్సులను రికార్డులను పరికరాలను ఇంజన్ ను పరిశీలించి ప్రజలకు అత్యవసర సేవల గురించి 102 అమ్మఒడి ద్వారా గర్భిణీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఎలాంటి అలసత్వం చేయకుండా సత్వరంగా సేవలు అందించాలన్నారు నాగర్ కర్నూల్ జిల్లాలో సిబ్బంది పనితీరు బాగుందని ప్రభుత్వం సహకారంతో ప్రజలకు అందిస్తున్న సేవలు ఎంతో బాగున్నాయని సిబ్బందిని అభినందించారు. అమ్మ ఒడి సేవ గర్భిణీ స్త్రీలకు వరమని అధికారులు ప్రతి గర్భిణి ఈ సేవను ఉపయోగించుకోవాలని సూచించారు ఈ సేవలపై ఆశ కార్యకర్తల్లో ప్రజలు అవగాహన పెంచడంలో ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన పెంచడంలో ముందుండి సహకరించాలన్నారు. ప్రజలు అత్యవసరము సమయంలో అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈఎంఈ శ్రీనివాసులు, సిబ్బంది వరప్రసాద్, శ్రీనివాస్, అరుణ్, డాక్టర్ వివేక, తేజ, ఉన్నారు.



# రైల్వే డబ్లింగ్‌కు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల జూలై 08(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లాలో రైల్వే డబ్లింగ్ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ ఇరిగేషన్,రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పురోగతిపై బుధవారం ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనగా,జోగులాంబ గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మహబూబ్‌నగర్--డోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 104 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని తెలిపారు.సంబంధిత రైతులతో భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే అవార్డు ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.అవార్డు పూర్తయిన వెంటనే భూమిని రైల్వే అధికారులకు అప్పగించే చర్యలు చేపడతామని వెల్లడించారు.ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో శివాజీ విగ్రహం ధ్వంసం..



**వనపర్తి, జూలై 8 (ప్రజాజ్యోతి):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ధ్వంసం ఘటనను ఖండిస్తూ హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం శివాజీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే కొత్త ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పునఃప్రతిష్ఠ నిర్వహించాలని కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా సందర్భంగా పోలీసులతో ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు, నాయకులు, స్థానికులు పాల్గొని శివాజీ మహారాజ్‌కు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు--2026కు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కోరారు.

ప్రభుత్వ, ప్రభుత్వ పరిషత్ పాఠశాలలు, నవోదయ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్, కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు “జాతీయ ఉపాధ్యాయ అవార్డులు--2026” కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గడువులోపు తమ దరఖాస్తులను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజ్ఞప్తి చేశారు.

# సర్పంచ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## -జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కె.రాజేందర్ గౌడ్



మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 08 (ప్రజా జ్యోతి): ప్రజా సంక్షేమం కోసం పనిచేసే సర్పంచులపై దాడులు చేయడం సరైనది కాదని, ఇలాంటివి పునరావృతం కాకుండా తక్షణమే తగిన రక్షణ కల్పించాలని,ఇటీవల ఖాన్ దొడ్డి సర్పంచ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కె.రాజేందర్ గౌడ్ అన్నారు. రెండు రోజుల క్రితం నారాయణపేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం ఖాన్ దొడ్డి గ్రామంలో సర్పంచ్ పై జరిగిన దాడిని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కలాల్ రాజేందర్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచ్లతో కలిసి ఖాన్ దొడ్డి గ్రామ సర్పంచ్ వెంకటేష్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆయనకు ధైర్యాన్నిస్తూ ఈ దాడి పై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులతోపాటు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కలాల్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో గల ప్రకృతి వనంలో చెట్లను మేస్తున్నాయని గ్రామ పంచాయతీ సిబ్బంది ఎంపీడబ్ల్యూ మేకలను బయటకు తరమడంతో అట్టి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో ఎంపీడబ్ల్యూ గ్రామ సర్పంచ్ వెంకటేష్ కు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ తన బాధ్యతగా తన గ్రామ నెలకొన్న సమస్యను గ్రామంలోనే పరిష్కరించుకుందామన్న ఉద్దేశంతో సర్పంచ్ జోక్యం చేసుకొని మేకల యజమానిని పిలిచి అడిగే క్రమంలో సర్పంచ్ పైననే దాడి చేయడం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్రంగా ఖండించాల్సిన విషయమని ఇలాంటి ఘటనలు ఆందోళనకరంగా ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులపై దాడులు చట్టవిరుద్ధం ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడే వారిని ప్రభుత్వం మరియు పోలీసులు కఠినంగా శిక్షించాలి ప్రజా సంక్షేమం కోసం పనిచేసే సర్పంచులకు తక్షణమే తగిన రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దాడికి సంబంధించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గుడిగండ్ల సర్పంచు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వాడ్వట్ సర్పంచు రవీందర్, పంచదేవ్ పహాడ్ సర్పంచ్ వెంకటేష్,ఖానాపూర్ సర్పంచ్ జయశ్రీ శివరాజ్,పంచలింగాల సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో ప్రతి ఒక్క ఓటరు భాగ్యస్వామి కావాలి





## కౌన్సిలర్ పీకే నరసింహ

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 08 (ప్రజా జ్యోతి):**

ఓటరు జాబితాలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం,ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా,తప్పులు లేకుండా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో వార్డులో ఉన్న అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని వార్డు కౌన్సిలర్ పీకే నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపాలిటీలోని తన వార్డులో ఎన్యుమరేషన్ ఫారాల పూరించు కార్యక్రమంలో కౌన్సిలర్ పీకే నరసింహ పాల్గొని ఎన్యుమరేషన్ పూరించే ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితాలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం,తప్పులను సరిదిద్దడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలి. దీనివల్ల తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితా రూపొందుతుందని, అందుకు వార్డు ప్రజలు, యువకులు బీఎల్ఓలు ఇంటింటి వచ్చి ఇచ్చినటువంటి ఎన్యుమరేషన్ ఫారాలలో
కుటుంబంలోని సభ్యుల వివరాలు,ఫోటోలు, పాత ఓటరు కార్డు వివరాలు సరిచూసుకోవాలి, అర్హత కలిగిన ఓటర్లు నిర్ణీత గడువులోపు తమ వివరాలను నమోదుచేసుకోవాలని సూచించారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ముఖ్యంగా ప్రతి ఇంటిలో ఉన్న చదువుకున్న యువకులు మన కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడంతో పాటు తెలియని వారికి అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డ్ కౌన్సిలర్ కౌన్సిలర్ పీకే నరసింహ,కుద్దుస్, విష్ణప్ప, విజయలక్ష్మీ,చంద్రకళ,మాజీ వార్డు నెంబర్ తిరుపతి వెంకటేష్,రంకుల నవీన్, రమేష్, కల్లూరి ఆంజనేయులు వార్డ్ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్కుల పంపిణీ

నాగర్ కర్నూల్ : జులై 08 (ప్రజా జ్యోతి)
నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ,ద్వితీయ,తృతీయ సంవత్సరం చదువుతున్న 200 మంది విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ మధుమోహన్ నోట్‌బుక్కులను పంపిణీ చేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు దాతల సహకారంతో ఉపయోగకరమైన నోట్‌బుక్కులనుఅందజేయడం జరిగిందని అన్నారు.అన్నిదానాల్లోవిద్యాదానం అత్యంత గొప్పదని ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూవిద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకుని కష్టపడి చదివి,తల్లిదండ్రులతోపాటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య,వనిత,ఉమాదేవి, కోదండరాములు,రామకృష్ణ పాల్గొన్నారు.




## రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు భూసేకరణ నెల రోజుల్లో పూర్తి చేస్తాం

### - ప్రగతి/పీఎంజీ ప్రాజెక్టుల పెండింగ్ అంశాలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతస్థాయి సమీక్ష



**మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రగతి/పీఎంజీ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శి (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్ అధ్యక్షతన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి ంచారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న నీటిపారుదల, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే అంశాలపై విస్తృతంగా చర్చించారు.మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పురోగతిని వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన భూసేకరణ ప్రక్రియను ఒక నెల రోజుల్లో పూర్తి చేసి, ప్రాజెక్టు పనులు వేగవంతంగా ముందుకు సాగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో నవీన్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## నేడు జాన్ పాడ్ దర్గాకు ప్రత్యేక బస్సు

### -డిపో మేనేజర్ యాదయ్య



**నాగర్ కర్నూల్ : జులై 08 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ డిపో నుంచి నేడు (గురువారం) నల్గొండ జిల్లా జాన్ పాడ్ దర్గాకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యాదయ్య బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు.ఈ బస్సు గురువారం మధ్యాహ్నం 2:00 గంటలకు నాగర్‌కర్నూల్ నుంచి బయలుదేరి దేవరకొండలోని ఖాదర్ వలి దర్గా దర్శనం తర్వాత జూలై పదవ తేదీ (శుక్రవారం) దర్గా దర్శనం ఉంటుందన్నారు. చార్జీ ఒక్కొక్కరికి రానుపోను 850 రూపాయలు నిర్ణయించినట్లు డిఎమ్ తెలిపారు.ఇతర వివరాలకు 949041159-9885042895 ను సంప్రదించాల ని కోరారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

**గద్వాల జూలై 08(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కళ్యాణ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ బుధవారం ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రతి ఆడపిల్ల విద్యావంతురాలు కావాలి

**- యువతతోనే దేశ భవిష్యత్తు నిర్మాణం**

**- కస్తూర్బా పాఠశాలలో ఐమాక్స్ లైట్ల ప్రారంభం**

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎంపీ డీకే అరుణ**



**మిడ్జిల్, జూలై 8 (ప్రజా జ్యోతి):**
ప్రతి ఆడపిల్ల ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లక్ష్యంతో చదువుకుంటూ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. విద్య ఉద్యోగం పొందడానికే కాకుండా సమాజానికి సేవ చేసే సాధనంగా ఉండాలని పేర్కొన్న ఆమె, ఒకరికొకరు సహాయం చేసుకునే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడి చదివి పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లో దుర్వాసన సమస్యను విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. లింబియా తండాలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల ప్రహరీ గోడకు భూమిపూజ చేయడంతో పాటు రూ. 4 లక్షలతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ప్రారంభించారు. రాణిపేటలో రూ. 8 లక్షలతో నిర్మించనున్న పాఠశాల కాంపౌండ్ వాల్‌కు భూమిపూజ చేశారు. అలాగే చేదుగట్టు తండా, ఈదులబాయి తండా, కాటోనిగడ్డ తండా, మర్లబాయి తండా, తమ్మిడికుంట తండా, తుల్జా నాయక్ తండా, గొల్లోనికుంట తండాల్లో నిర్మించనున్న పాఠశాల ప్రహరీ గోడలకు సంబంధించిన పరిపాలనా అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. విద్యా మౌలిక వసతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డీకే అరుణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలా త్రిపురసుందరి, జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ విజయం, జిల్లా అధ్యక్షుడు పల్లి తిరుపతి, మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, లాలు ప్రభాకర్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, పరశురాం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థినులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధననే ముఖ్య లక్ష్యం

**-గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్**



**నాగర్ కర్నూల్:జులై 08(ప్రజా జ్యోతి)**
తెలంగాణ గిరిజన సమాఖ్య నాగర్ కర్నూల్ జిల్లా రెండవ మహాసభ బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని కే.ఎల్.ఐ గెస్ట్ హౌస్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులపై చాలా వివక్ష జరుగుతుందని దేశానికి స్వతంత్రం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడిచినా దేశంలో, రాష్ట్రంలో ఆదివాసి గిరిజనుల పరిస్థితి దుర్భరంగానే ఉందని,గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయించినప్పటికీ చట్టాలు చేసినప్పటికీ పాలకవర్గాలు గిరిజనుల పట్ల అనుసరించిన గిరిజన వ్యతిరేక విధానాలే దీనికి కారణమని ఆదివాసీల హక్కుల పరిరక్షణకు విశాలమైన దృక్పథంతో 1957 వ,సంవత్సరంలో అఖిలభారత ఆదివాసి మహాసభ అబిర్భవించింది దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించి ఆదివాసి గిరిజనుల చైతన్యపరిచి పార్లమెంట్లో ఆమోదించిన అటవీ హక్కుల చట్టం సాధనకు సమరశీల పోరాటాలు నిర్వహించి ప్రతి గిరిజనుడికి సాగు భూమి,పోడు భూ పోరాటాలు నిర్వహించి పోడు పట్టాలను గిరిజనులకు ఇప్పించడం జరిగిందని అన్నారు. అఖిలభారత ఆదివాసి మహాసభల పోరాటాల స్ఫూర్తిగా గిరిజనులకు జీవనాధారంగా ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అటవీ బంజరులను ప్రభుత్వం మిగులు భూములను పంచాలని ఇళ్ల స్థలాలివ్వాలని,అర్హులైన ప్రతి గిరిజనులకు రుణాలిచ్చి,గ్రామాలలో మౌలిక సదుపాయాలైన విద్యుత్,వైద్యం,రహదారులు, త్రాగునీరు,సాగునీరు సౌకర్యాలు కల్పించాలనిఅన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనులకు ఎటువంటి సంక్షేమ పథకాలు,అభివృద్ధికి నోచుకోవడం లేదని,తెలంగాణ రాష్ట్రంలో పోడు భూముల సమస్య అధికంగా మిగిలిందని,గిరిజనులపై భూస్వాముల పెత్తందారుల ఆగడాలు పెరిగిపో తున్నాయని,గిరిజనులకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక ఇంకా భూస్వాముల దగ్గర పెత్తందారులవద్ద జీతగాళ్ళుగా ఉంటూ వారిచ్చే ఆరోకూర రూపాయలను అలా జీవనోపాధికి వినియోగించుకుంటున్నారన్నారు గిరిజనుల ఆర్థిక విధానాలపై అనేక దాడులు మనుషులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో తుమ్మల శివుడు,కిరణ్ కుమార్, బండి లక్ష్మీపతి,ప్రేమ్ కుమార్,శివ,యూసుఫ్, జంగల్ శివుడు,బర్మల మల్లయ్య,బయన్న సిద్దు, మద్దిలేటి పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై నేడు జిల్లా స్థాయి అవగాహన సదస్సు

**- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలి**

మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో): గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని జూలై 9వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎనిమిది మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, అమలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ సమావేశంలో అవగాహన కల్పించనున్నట్లు ఇన్‌చార్జి డీపీఓ తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**- ఎన్యూమరేషన్ ఫారం సమర్పణ.. ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**



**భూత్పూర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో ):**
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. భూత్పూర్ మండలంలోని తన స్వగ్రామం అన్నాసాగర్లోని నివాసానికి వచ్చిన బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ)కు అవసరమైన వివరాలు, సంబంధిత పత్రాలను అందజేసి ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సమర్పించారు. అనంతరం బీఎల్ఓతో మాట్లాడిన ఆల వెంకటేశ్వర్ రెడ్డి, క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం సజావుగా, పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమని, ప్రతి అర్హుడైన ఓటరు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను గడువులోగా నమోదు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సరైన వివరాలతో ఓటరు జాబితా రూపొందితేనే ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా ఉంటుందని పేర్కొన్నారు.

# మాడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

**మహబూబ్‌నగర్, జూలై 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**
శబ్ద కాలుష్యాన్ని అరికట్టి ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు మాడిఫైడ్ సైలెన్సర్లతో తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ దరావత జానకి ఆదేశాల మేరకు బుధవారం సౌండ్ పొల్యూషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. షోరూమ్ నుంచి వచ్చిన అసలు సైలెన్సర్‌ను తొలగించి, అధిక శబ్దం వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్లతో వాహనాలు నడుపుతున్న ఇద్దరు వాహనదారులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారికి శబ్ద కాలుష్యం వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులు, ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించి, నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన సైలెన్సర్లను తొలగించి, కంపెనీ నిర్దేశించిన సైలెన్సర్లనే వినియోగించాలని సూచించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కొందరు యువకులు తమ వాహనాలకు అధిక శబ్దం వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకొని రోడ్లపై సంచరిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారని తెలిపారు. ఇటువంటి చర్యల వల్ల వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, రోగులు, సాధారణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు కంపెనీ నిర్దేశించిన సైలెన్సర్లనే ఉపయోగించి శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



# నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రం ప్రారంభం






**నాగర్ కర్నూల్ : జులై 08 (ప్రజా జ్యోతి)**
రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్,ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బాలలు, మహిళల కోసం ఏర్పాటు చేసిన నూతన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,మహిళలుమరియు బాలలకు రక్షణ,న్యాయ సహాయం, వైద్య సేవలు,మానసిక పరామర్శ,కౌన్సెలింగ్‌వంటి సేవలు ఒకే చోట అందించాలనే లక్ష్యంతో భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా బాధితులకు త్వరితగతిన సహాయం అందుతుందని అన్నారు.ఎమ్మెల్యేకూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,భరోసా కేంద్రం ద్వారా మహిళలకు,బాలికలకు అన్ని రకాల సేవలు సులభంగా అందుతాయన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్,మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,స్థానిక కౌన్సిలర్లు మండల నాయకులు,ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులు,మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ వెన్నచేడు అసిస్టెంట్ మేనేజర్‌కు ఘన సన్మానం

**గండీడ్, జూలై 8 (ప్రజాజ్యోతి):**
గండీడ్ మండలంలోని వెన్నచేడు ఎస్‌బీఐ శాఖలో విధులు నిర్వహించిన అసిస్టెంట్ మేనేజర్ పి. నరేందర్ బదిలీ సందర్భంగా ఖాతాదారులు ఘనంగా సన్మానించి భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. బ్యాంకు మేనేజర్ భాస్కరరావు సమక్షంలో పూలదండలు, శాలువాలతో ఆయనను సత్కరించి, అందించిన సేవలను కొనియాడారు.పి. నరేందర్ తన సేవాకాలంలో గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, నామినీ వివరాలు లేక నిలిచిపోయిన ఖాతాలు, బ్యాంకు నిబంధనల్లో వచ్చిన మార్పులపై అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖాతాదారుల సమస్యలను ఓర్పుతో పరిష్కరిస్తూ విశేష సేవలు అందించారు. పెండింగ్ కేసులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అవసరమైన పత్రాలపై స్పష్టమైన సూచనలు ఇస్తూ ఖాతాదారులకు రావాల్సిన మొత్తాలు అందేలా కృషి చేశారు.ప్రతి ఖాతాదారుడిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను పూర్తిగా విని త్వరితగతిన పరిష్కారం చూపేందుకు కృషి చేయడం వల్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, గ్రామీణ ప్రాంతాల ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలతో బ్యాంకుపై ఖాతాదారుల్లో విశ్వాసం మరింత పెరిగిందని పలువురు పేర్కొన్నారు.బదిలీ సందర్భంగా మాట్లాడుతూ, పి. నరేందర్ అందించిన సేవలను తాము ఎప్పటికీ మరువలేమని, ఆయన లాంటి



సేవాభావం కలిగిన అధికారి తమ శాఖ నుంచి వెళ్లిపోవడం బాధాకరమని ఖాతాదారులు భావోద్వేగం వ్యక్తం చేశారు. ఆయన భవిష్యత్ ఉద్యోగ జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ భాస్కరరావు, వెంకట్ రాములు గౌడ్, నర్సింలు, శ్రీనివాస్, వజ్రపతి, ఎజాజ్. పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

# ఆర్డీఎస్ వద్ద కర్ణాటక అక్రమ నీటి తరలింపు..?

**- అనకట్టను పరిశీలించిన మాజీ మంత్రులు**
**- తెలంగాణ వాటాను కాపాడాలని ప్రభుత్వానికి డిమాండ్**



**జడ్చర్ల, జూలై 8 (ప్రజా జ్యోతి):**
ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) అనకట్ట సమీపంలో కర్ణాటక ప్రభుత్వం రహస్య కాలువ ద్వారా సుమారు రెండు టీఎంసీల నీటిని అక్రమంగా తరలిస్తోందని ఆరోపిస్తూ పలువురు ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యల వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, ప్రణీల్ చందర్, నాగిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్ తదితరులు బుధవారం ఆర్డీఎస్ అనకట్టను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ, కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నీటిని మళ్లించడం వల్ల మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు చట్టబద్ధంగా రావాల్సిన నీటి వాటాను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, కర్ణాటక చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ నీటి తరలింపును అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ జలాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడకుండా వ్యవహరించాలని, జిల్లాలోని రైతుల ప్రయోజనాలను కాపాడాలని నాయకులు కోరారు.



# ఉపాధ్యాయుల నైపుణ్యాల అభివృద్ధితోనే నాణ్యమైన విద్య సాధ్యం

**- ఏఎంఓ విద్యాసాగర్**



**నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి)**
పాఠశాల విద్యాశాఖ -- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో నిర్వహిస్తున్న 3 రోజుల జిల్లా స్థాయి సమీకృత ఇన్-సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం బుధవారం జడ్పీహెచ్‌ఎస్ జాజాపూర్లో ఘనంగా ప్రారంభమైంది.ఈ శిక్షణ కార్యక్రమాన్ని కోర్సు కోఆర్డినేటర్ ఏఎంఓ శ్రీ విద్యాసాగర్, సీఎంఓ శ్రీ రాజేంద్ర కుమార్, జిల్లా సైన్స్ అధికారి (డీఎస్ఓ) శ్రీ భానుప్రకాశ్, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి భారతి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఎంఓ శ్రీ విద్యాసాగర్ మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణ ద్వారా పొందిన నూతన బోధనా పద్ధతులను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థిలో నేర్చుకునే ఆసక్తి, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిబద్ధత, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి నిజమైన శిల్పులని పేర్కొన్నారు.సీఎంఓ శ్రీ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ, నేటి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను నవీకరించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో ఆచరణలో పెట్టినప్పుడే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని పేర్కొన్నారు.డీఎస్ఓ శ్రీ భానుప్రకాశ్ శిక్షణ కార్యక్రమం లక్ష్యాలు, నిర్వహణ విధానం గురించి వివరించగా, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి భారతి శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి, కార్యక్రమం విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ శిక్షణలో హిందీ సబ్జెక్టుకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు చెందిన 90 మంది ఉపాధ్యాయులు, మొత్తం 150 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా మధ్యాహ్న భోజన సమన్వయకర్త యాదయ్య శెట్టి, రిసోర్స్ పర్సన్లు శ్రీ రాకేష్, శ్రీ శంకర్ తిరుమల్, శ్రీ మిస్కిన్ శ్రీనివాస్, శ్రీమతి యాదమ్మ, శ్రీ సంతోష్ కుమార్, శ్రీ శ్రీనివాస్, శ్రీ దామోదర్ రెడ్డి, శ్రీ జైపాల్ రెడ్డి పాల్గొని శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో తమ సేవలను అందించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యతను మరింత మెరుగుపరచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# 108 అంబులెన్స్ లో పాండురంగయ్య సేవలు అభినందనీయం

**రాష్ట్ర అత్యవసర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు**

**కల్వకుర్తి,జులై 8 (ప్రజా జ్యోతి):**
108 అంబులెన్స్ లో పాండురంగయ్య సేవలు అభినందనీయమని రాష్ట్ర వాహనాల అధికారి వరప్రసాద్ రాజు అన్నారు. బుధవారం 108 అంబులెన్స్ కార్యాలయంలో పాండురంగయ్యను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తో కలిసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ108 అంబులెన్సులో 21 సంవత్సరాలు డ్యూటీ చేసి అంబులెన్సులు ఎంతో మంది ప్రాణాలను కాపాడి ఆయన సర్వీసులో ఎలాంటి మచ్చ లేకుండా రిటైర్డ్ అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈఎంఈ శ్రీనివాసులు, సిబ్బంది వరప్రసాద్, శ్రీనివాసులు, అరుణ్, తేజ, ఉన్నారు.



# ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టాలి

**-నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్**
**- లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి.**
**-నేరాల నియంత్రణ పై దృష్టి సారించాలని.**
**-నేరస్తులకి శిక్ష పడే విధంగా కృషి చేయాలి.**
**-రోడ్డు ప్రమాదల నివారణకు ప్రత్యేక చర్యలు.**



**నారాయణపేట ప్రతినిధి జూలై 07 ( ప్రజా జ్యోతి)** జిల్లా లో నమోదు అవుతున్నా అయా కేసులలో అధికారులు పకడ్బదీగా పారదర్శకంగా విచారణ చేపట్టాలని, అందుకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ను పెంపొందించుకోవాలని, ప్రతి కేసును లోతుగా విచారణ చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులకు తెలియజేశారు. బుధవారం రోజు జిల్లా పోలీసు అధికారులు డీఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో బాగంగా ముందుగా జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో లాంగ్ పెండింగులో ఉన్న కేసుల వివరాలను, యు ఐ కేసులను అడిగి పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రాపర్టీ నేరాలను లోతుగా విచారణ చేపట్టి నేరస్తులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణ పై దృష్టి సారించాలని, మహిళా, బాలికల నేరాల పై కఠిన చర్యలు తీసుకోవాలని, ముందస్తు నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.
ఈ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో బాధితులకు మరింత సౌకర్యం కల్పించడం కోసం ఇంటి వద్దకు వెళ్లి ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలి అని సూచించారు తమ పరిదిలో జరిగే నేరాల లో పకడ్బదీగా విచారణ చేసి నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి భాదితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కేసు విచారణలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేసుకొని పకడ్బదీగా విచారణ చేపట్టాలని, పార్ట్-1, పార్ట్-2 స్టేట్మెంట్ రికార్డ్, సిడిఎఫ్ ,ఫీల్ చేయుట, పోటో స్ , ప్రాపర్టీ సీజ్, నిందితుల వివరాలు ఎంట్రి చేయట, రిమాండ్ డైరీ చార్జి షీట్ ఫీల్ చేయుట తదితర అంశాల పై ఆయా కేసులలో ఫైల్ లను పరిశీలించి ఎస్ హెచ్ ఓ లకు తగు సూచనలు చేశారు. రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు సేఫ్టీ గురించి విస్తృతంగా ట్రాపిక్ నియమాల పై అవగాహనా కల్పించాలని అన్నారు. ఎస్సై లు తప్పని సరిగా గ్రామాలను సందర్శించాలని, ప్రతి రోజు రోల్ కాల్ ఎర్పాటు చేసి విధుల గురించి తెలపాలని, ప్రతి నెల చీఫ్ ఆఫీస్ కు పంపే రిపోర్ట్స్ సమయానికి పంపాలని తెలిపారు. వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరిరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న పండగలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిధిలో ఉన్న రౌడీ షీటర్ లను, కమ్యునల్ షీటర్స్ నీ బైండోవర్ చేయాలని తెలిపారు. నూతన అప్లికేషన్స్ పై అవగాహన కల్గిఉండాలని ప్రాపర్టీ నేరాల పై నిఘా ఉంచి దృష్టి సాధించాలని అన్నారు. నేరాల నియంత్రణ చేదనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి లు నల్లపు లింగయ్య , మహేష్, సిఐ లు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ ఐలు వెంకటేశ్వర్లు, రాజు, నరేష్, రమేష్, భాగ్య లక్ష్మీ రెడ్డి, అశోక్ బాబు, ఎస్ ఎం, నవీద్, విజయ్ భాస్కర్, పురుషోత్తం, శ్రీనివాసులు, సునీత, గాయత్రి, మహేశ్వరి, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతుకు బంగారు భవిష్యత్

**-చిన్నమారూర్‌లో 10 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్ ప్రారంభం**
**-ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, ప్రోత్సాహకాలతో రైతులకు భరోసా**



**చిన్నంబావి, జూలై 8 (ప్రజాజ్యోతి)** సాగునీటి వసతి ఉన్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలికంగా లాభదాయకమని మండల ఉద్యాన అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. చిన్నంబావి మండలం చిన్నమారూర్ గ్రామానికి చెందిన రైతు జగన్మోహన్ రెడ్డి పొలంలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయిల్ పామ్ మొక్కను నాటి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తూ ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పంట నాటిన మూడేళ్ల తర్వాత నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయని, ఆ తర్వాత ప్రతి నెలా రెండు దఫాలుగా గెలల కోత చేపట్టవచ్చని తెలిపారు. ఒకసారి తోటను ఏర్పాటు చేస్తే 25 నుంచి 30 సంవత్సరాల పాటు నిరంతర ఆదాయం లభిస్తుందని చెప్పారు. రైతులు పండించిన ఆయిల్ పామ్ గెలలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ప్రీ యూనిక్ కంపెనీ కొనుగోలు చేస్తోందని, మార్కెటింగ్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, సకాలంలో నీటి నిర్వహణ చేపడితే ఎకరాకు ఏటా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు నాణ్యమైన మొక్కలతో పాటు డ్రిప్ సేద్య పరికరాలపై 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్, అంతర పంటల నిర్వహణ కోసం ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు ప్రోత్సాహక నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యాన శాఖ అధికారులు, ప్రీ యూనిక్ కంపెనీ సిబ్బంది క్షేత్రస్థాయిలో సాంకేతిక సహాయం అందిస్తారని తెలిపారు. రైతు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ పంటల్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల అనుభవాలను పరిశీలించిన తర్వాత ఈ పంటపై విశ్వాసం ఏర్పడిందన్నారు. అందుకే 10 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గుర్తించిన కంపెనీ ద్వారా గెలల కొనుగోలు ఉండటంతో మార్కెటింగ్ సమస్యలు ఉండవని, సాగునీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి శిరీష, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ అధికారి మహేష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి) మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జూలై 6, 7 తేదీల్లో నిర్వహించిన జోగులాంబ పోలీస్ జోన్--7 పోలీస్ డ్యూటీ మీట్లో నారాయణపేట జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేతలు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, గారిని మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్, మాట్లాడుతూ... జోనల్ స్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం నారాయణపేట జిల్లా పోలీసులకు గర్వకారణమని అన్నారు. ఈ విజయం వెనుక పోలీసు సిబ్బంది నిరంతర సాధన, వృత్తిపరమైన నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం ఉన్నాయని కొనియాడారు. అలాగే, రానున్న సెప్టెంబర్ నెలలో మల్కాజిగిరిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్లో కూడా ఇదే స్ఫూర్తితో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి నారాయణపేట జిల్లా పోలీసుల ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు.



విజేతల వివరాలు:
- క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఢ క్రిమినల్ లా విభాగం: ఎస్ఐ కృష్ణ (ఎస్.ఎం. నవీద్) -- ద్వితీయ స్థానం.
- ఫోటోగ్రఫీ విభాగం: పీసీ సి. వెంకట్ రాములు (పిఆర్ఓ) -- ప్రథమ స్థానం.
- వీడియోగ్రఫీ విభాగం: పీసీ బి. నరేష్ -- ప్రథమ స్థానం.
- ట్రాకింగ్ విభాగం: పోలీస్ జాగిలం "రుద్ర", హ్యాండ్లర్లు రవి, నరేందర్ -- ద్వితీయ స్థానం.
- బాంబు డిస్పోజల్ టీమ్ -- రూమ్ సెర్చ్ విభాగం: డి. లక్ష్మీకాంత్ రెడ్డి, ఆంజనేయులు -- ప్రథమ స్థానం.
- బాంబు డిస్పోజల్ టీమ్ -- యాక్సెస్ కంట్రోల్ విభాగం: డి. లక్ష్మీకాంత్ రెడ్డి, ఆంజనేయులు -- ద్వితీయ స్థానం.

ఈ విజయాలు నారాయణపేట జిల్లా పోలీసు శాఖలో ఉన్న ప్రతిభ, కృషి, శిక్షణ ప్రమాణాలకు నిదర్శనమని ఎస్పీ పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, ఆర్ ఐ విజయ్ భాస్కర్, విజేతలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**-మంత్రులు పొన్నం ప్రభాకర్-జూపల్లి కృష్ణారావు**

**నాగర్ కర్నూల్ : జూలై 08 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు ఎమ్మెల్యేకూచుకుళ్ల రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీ కూచుకుళ్లదామోదర్ రెడ్డిలతో కలిసి బుధవారం నాగర్ కర్నూల్-వనపర్తికి నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు సర్వీస్ ప్రారంభంతో నాగర్‌కర్నూల్ వనపర్తి జిల్లాల మధ్య ప్రయాణించే విద్యార్థులు,ఉద్యోగులు,సాధారణ ప్రయాణికులు,వ్యాపారులకు సౌకర్యవంతమైనరవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయని ప్రజల అవసరాలకనుగుణంగా ఆర్టీసీ సేవలను విస్తరిస్తూ ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రారంభించిన ఈ నూతన బస్సు సర్వీస్ వేలాది మంది ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్,టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌నాగి రెడ్డి,ఆర్టీసీ అధికారులు,మార్కెట్ కమిటీ చైర్మన్,మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు,కాంగ్రెస్‌పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

